క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్: మేడ్చల్ ప్రభుత్వ ఐటీఐలో నిర్వహిస్తున్న ఫుడ్ ప్రాసెసింగ్ కోర్సుల్లో చేరుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. ఐటీఐలో జీవనోపాధి వ్యాపార అంకుర సంస్థ ఆధ్వర్యంలో కూరగాయల ప్రాసెసింగ్, పల్పింగ్, జామ్ తయారీ వంటి అంశాలపై కోర్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయసు గల వారు దరఖాస్తుకు అర్హులని, ఈ నెల 23వ తేదీ నుంచి దరఖాస్తులు ఐటీఐలో స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

పెండింగ్ అర్జీలను వెంటనే పరిష్కరించాలి

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ పెండింగ్‌లో ఉన్న అర్జీలను వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం మేడ్చల్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో 92 ఫిర్యాదులతో కూడిన అర్జీలను ప్రజలు అందజేశారు. జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమావేశం

పోచారం: రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం ఈ నెల 18వ తేదీ నుంచి జరగనున్న నేపథ్యంలో సోమవారం పోచారం మున్సిపల్ కార్యాలయంలో సన్నాహక సమావేశాన్ని చైర్మన్ కొండల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, మెప్మా కోఆర్డినేటర్ పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌లో నాకాబందీ

ఘట్‌కేసర్: రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ ఆదేశం మేరకు ఘట్‌కేసర్ ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు వద్ద సీఐ అశోక్‌రెడ్డి, డీఐ జంగయ్య ఆధ్వర్యంలో సోమవారం నాకాబందీ చేపట్టారు. ఇటీవల చైన్ స్నాచర్స్ పెరుగుతున్న నేపథ్యంలో యంనంపేట్ వైపు నుంచి అన్నోజీగూడ, ఘట్‌కేసర్ వైపు వెళ్తున్న వాహనాలను సర్వీస్ రోడ్డు వద్ద తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా నంబర్ ప్లేట్, హెల్మెట్ లేని వాహనాల యజమానులకు జరిమానా విధించారు.

కానిస్టేబుల్‌కు గాయాలు..

నాకాబందీలో ఓ వాహనదారుడు తప్పించుకోవాలని వేగంగా ప్రయాణిస్తుండగా వాహనాన్ని ఆపే క్రమంలో కానిస్టేబుల్ నాగరాజును ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే నాగరాజును నగరంలోని కామినేని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కారణమైన వాహనదారుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

బిట్స్ పిలానీలో జాతీయ స్థాయి వర్క్‌షాప్



జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని బిట్స్ పిలానీలో గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి వర్క్‌షాప్ 'లీనియర్ ఆల్జీబ్రా డిఫరెన్షియల్ ఈక్వేషన్స్ అండ్ అప్లికేషన్స్'ను సోమవారం బిట్స్ పిలానీ డైరెక్టర్ ప్రొఫెసర్ సుందర్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణితశాస్త్ర పరిజ్ఞానాన్ని మరింత పెంచేందుకు బోధన పద్ధతుల నవీకరణకు ఇలాంటి వర్క్‌షాప్ ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో బిట్స్ పిలానీ గణిత శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ సాహూ, ప్రొఫెసర్ బివుదత్త మిశ్రా, ప్రొఫెసర్ నారపరాజు, కిషోర్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

'3 ఏళ్లలో రూ.51 కోట్లతో అభివృద్ధి'



కమిషనర్ వాణీరెడ్డిని అభినందిస్తున్న చైర్మన్

కీసర: గత మూడేళ్ల కాలంలో సుమారు రూ.51కోట్ల నిధులతో నాగారం మున్సిపాలిటీలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డుల్లో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు ముందుకెళ్లడం జరుగుతుందన్నారు. కొత్తగా వివిధ వార్డుల్లో మరో రూ.71 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు తీర్మానించారు. కంటి వెలుగు నిర్వహణకు రూ.2లక్షలు కేటాయించనున్నట్లు తెలిపారు. అనంతరం స్వచ్ఛ సర్వేక్షన్-2022లో భాగంగా ఓడీఎఫ్ అవార్డు స్వీకరించిన కమిషనర్ వాణీరెడ్డిని చైర్మన్ చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు అభినందించారు.

వ్యక్తి అదృశ్యం



కేశవులు

జవహర్‌నగర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ చంద్రశేఖర్ వివరాల ప్రకారం... దమ్మాయిగూడలోని సాయిలోక్ కాలనీలో నివసించే గోపగాని కేశవులు(48) శనివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఆయన ఆచూకీ కోసం సమీప ప్రాంతాల్లో గాలించినా ప్రయోజనం లేకపోవడంతో సోమవారం సాయంత్రం జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అవిశ్వాసానికి సై..!

జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో వేడెక్కిన రాజకీయం

- పాలకవర్గంలో చీలికలు
- మేయర్‌కు సహాయ నిరాకరణ
- మేయర్, డిప్యూటీ మేయర్ రేసులో పలువురు ఆశావహ కార్పొరేటర్లు



జవహర్‌నగర్: జవహర్‌నగర్ మేయర్ పీఠంపై కార్పొరేటర్ల కన్నుపడింది. అందులో భాగంగానే ఈ మధ్య కాలంలో మున్సిపల్ అధికార కార్యక్రమాల్లో పాల్గొనకుండా కార్పొరేటర్లు సహాయ నిరాకరణ చేస్తున్నట్లు కనిపిస్తోంది. మేయర్‌పై అవిశ్వాసం తీర్మాణం సైతం ప్రవేశపెట్టేందుకు సిద్ధమైతున్నట్లు వినికిడి. ఇందులో భాగంగా ఆశావహులు గ్రూపులను కొనసాగిస్తూ మద్దతును కూడగడుతున్నారు. భవిష్యత్‌లో క్యాంపు రాజకీయాలు సైతం నడిపేందుకు తగిన ఏర్పాట్లకు సిద్ధమవుతున్నారు.

రహస్య సమావేశాలు...

గత కొంత కాలంగా డిప్యూటీ మేయర్‌తో పాటు పలువురు కార్పొరేటర్లు రహస్య సమావేశాలు నిర్వహిస్తున్నారు. సోమవారం కమిషనర్, మేయర్ అధ్యక్షతన అధికారికంగా నిర్వహించాల్సిన ప్రభుత్వ కంటి వెలుగు కార్యక్రమం మొదట ఉదయం నిర్వహించాల్సి ఉండగా మేయర్ అందుబాటులో లేదని సాయంత్రం ఏర్పాటు చేయడంతో ఆ కార్యక్రమానికి వెళ్లకుండా డిప్యూటీ మేయర్‌తో పాటు 20 మంది కార్పొరేటర్లు జవహర్‌నగర్ శివారు ప్రాంతాల్లో రహస్య సమావేశం నిర్వహించారు. దీంతో జవహర్‌గనర్‌లో ఒక్కసారిగా రాజకీయం వేడెక్కింది.

28 మంది కార్పొరేటర్లు...

దాదాపు 3 లక్షల జనాభ ఉన్న జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో 28 మంది కార్పొరేటర్లు, ఐదుగురు కోఆప్షన్ సభ్యులు ఉన్నారు. వీరిలో మేయర్, డిప్యూటీ మేయర్‌తో కలిసి 26 మంది కార్పొరేటర్లు ఉన్నారు. గత కొద్ది నెలల క్రితం 16వ డివిజన్ కార్పొరేటర్ విశ్రాంతమ్మ అనారోగ్యంతో మృతి చెందింది.

క్యాంపు రాజకీయాలకు కలిసొచ్చిన సంక్రాంతి..

జవహర్‌నగర్‌లో మేయర్ పీఠం కోసం ఎదురు చూస్తున్న పలువురు ఆశావహులకు సంక్రాంతి సంబరాలు క్యాంపు రాజకీయాలకు కలిసొచ్చాయి. సోమవారం మెజార్టీ కార్పొరేటర్లు ఆంధ్రప్రదేశ్‌లో జరిగే సంక్రాంతి సంబరాల్లో పాల్గొనేందుకు కార్పొరేటర్లు పయనమవుతున్నారు. అక్కడే మేయర్, డిప్యూటీ మేయర్ అభ్యర్థులపై హామీలు ఇవ్వనున్నారు.

డిప్యూటీ రేసులో కొంత మంది కార్పొరేటర్లు...

మేయర్ పీఠంతో పాటు డిప్యూటీ మేయర్ కోసం పలువురు కార్పొరేటర్లు పావులు కదుపుతున్నారు. డిప్యూటీ మేయర్ పదవి కోసం కూడా మంత్రి మల్లారెడ్డి వద్ద పలువురు కార్పొరేటర్లు చర్చకు లేవనెత్తారు. జనరల్ కోటా నుంచి మేము డిప్యూటీ బరిలో ఉంటామని దీమా వ్యక్తం చేస్తున్నారు. దీంతో మేయర్‌తో పాటు డిప్యూటీ మేయర్ పదవికి సైతం పోటీ పడుతున్నారు.

అవిశ్వాసం జరిగేనా...

పురపాలక మంత్రి కేటీఆర్ నాలుగేళ్ల వరకు అవిశ్వాసం ఉండదని గతంలో తెలిపారు. దీంతో మేయర్ వర్గం అవిశ్వాసం ఇప్పట్లో ఉండే అవకాశం లేదని కొట్టి పారేస్తున్నారు. 2020 జనవరి 26వ తేదీన మేయర్ కావ్య, డిప్యూటీ మేయర్ అధ్యక్షతన జవహర్‌నగర్ నూతన పాలకవర్గం పదవీ బాధ్యతలు చేపట్టింది. 2023 జనవరి 26కు మూడేళ్ల కాలం పూర్తి కావస్తోంది. గత ఆరు మాసాలుగా మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ల మధ్య అంతర్గత విభేదాలు కొనసాగుతున్నాయి. నాటి నుంచి వర్గాలుగా చీలిపోయారు. అధికార పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ కార్యక్రమాలు ఎవరికి వారే వర్గాలుగా విడిపోయి చేస్తున్నారు. తాజాగా సోమవారం సుమారు 20 మంది కార్పొరేటర్లు రహస్య మంతనాలు జరిపారు. అవిశ్వాసం పెట్టేందుకు తమ వంతు ప్రయత్నాలు ప్రారంభించారు. ఏది ఏమైనా ఈ నెల 26 వరకు వేచిచూస్తే అవిశ్వాసంపై పూర్తి విషయం తెలుస్తోంది.



జవహర్‌నగర్‌లో రహస్య సమావేశంలో డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన నలుగురికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన ఆర్థిక సాయం చెక్కులను మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. గుండ్లపోచంపల్లికి చెందిన అనసూయకు రూ.37వేలు, ప్రభాకర్‌రెడ్డి రూ.27వేలు, బ్రహ్మయ్యకు రూ.16వేలు, శారద కు రూ.15వేలు సీఎం సహాయనిధి మంజూరీ కావడంతో లబ్ధిదారులకు చెక్కులను ఆమె అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ప్రభాకర్, కమిషనర్ రాములు కౌన్సిలర్లు జైపాల్‌రెడ్డి, బాలరాజు, హేమంత్‌రెడ్డి, మల్లికార్జున్ ముదిరాజ్, హంసరాణి, కోఆప్షన్ సభ్యుడు చిన్నపరెడ్డి ఉన్నారు.

4వ వార్డుకు చెందిన లబ్ధిదారుకి..

సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కును మంత్రి మల్లారెడ్డి తన నివాసంలో లబ్ధిదారుడికి అందజేశారు. పట్టణంలోని 4వ వార్డు కిష్టాపూర్‌కు చెందిన పద్మకు రూ.60వేల ఆర్థిక సాయం మంజూరీ కావడంతో ఆట్టి చెక్కును కౌన్సిలర్ గణేష్‌తో కలిసి మంత్రి అందజేశారు.

రాయిలాపూర్ గ్రామ వాసికి..

మేడ్చల్‌రూరల్: మండలంలోని రాయిలాపూర్ గ్రామానికి చెందిన చింతల ప్రవీణ్‌కు సోమవారం గ్రామ సర్పంచ్ నర్మద గోపాల్‌రెడ్డి రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేశారు. కార్యక్రమంలో రవిందర్‌రెడ్డి, సంజీవరెడ్డి, గోపాల్‌రెడ్డి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

సద్భావన టౌన్‌షిప్‌లో సమస్యలు పరిష్కరించాలి



ఏజీఎం రవీందర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

పోచారం: రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ నిర్మించిన సద్భావన టౌన్‌షిప్‌లో సమస్యలు పరిష్కరించాలని బాధితులు కోరారు. పోచారం సద్భావన టౌన్‌షిప్‌లో ఇటీవల కొత్తగా ఫ్లాట్లు కొనుగోలు చేసిన యజమానుల సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హెచ్ఎండీఏ కేటాయించిన సద్భావన ఫ్లాట్లలో మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వాటర్ లీకేజీలు ఎక్కువగా ఉండటంతో కొన్ని ఫ్లాట్లకు నీరు సరఫరా కావడం లేదన్నారు. చాలా చోట్ల డ్రైనేజీ పైపులు పగిలి పోవడంతో దుర్వాసన వస్తోందని, 9 ఫ్లోర్లు ఉన్న టౌన్‌షిప్ బ్లాకుల్లో లిఫ్టులు పనిచేయకపోతే ఎలా ఉండగలమని అధికారులను ప్రశ్నించారు. అనంతరం స్వగృహ కార్పొరేషన్ ఏజీఎం రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అందుకు ఆయన స్పందిస్తూ.. రూ.1.60 కోట్లతో సమస్యల పరిష్కారానికి నివేదిక రూపొందించామని, ఇప్పటికే 45 శాతం ఫ్లాట్ల కేటాయింపు జరిగిందన్నారు. మిగిలిన ఫ్లాట్లను 18వ తేదీన కేటాయించనున్నట్లు తెలిపారు.

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న కమిషనర్, మేయర్

జవహర్‌నగర్: ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని జవహర్‌నగర్ మేయర్ మేకల కావ్య అన్నారు. సోమవారం సాయంత్రం మేయర్, కమిషనర్ అధ్యక్షతన జవహర్‌నగర్‌లోని డ్వాక్రా భవనంలో కంటి వెలుగు కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వం కోట్ల రూపాయలను ఖర్చు చేస్తోందని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కంటి వెలుగు రెండో విడతను విజయవంతం చేయాలన్నారు. అనంతరం జవహర్‌నగర్ వైద్యాధికారి పద్మావతి ఆశ వర్కర్లు, వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు.

కార్పొరేటర్లు గైర్హాజరు..

కంటి వెలుగు రెండో విడతపై సోమవారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమానికి కార్పొరేటర్లు గైర్హాజరయ్యారు. కార్యక్రమంలో డీఈ బాలమురళి, కోఆప్షన్ సభ్యులు పక్కర్ అలీ, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్పీలు, ఆశ వర్కర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై ఆర్డీఓకు ఫిర్యాదు



ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లో అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తూ పంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్నారని ఆరోపిస్తూ సర్పంచ్ సురేశ్, బిల్ కలెక్టర్‌పై పాలకవర్గం సభ్యులు ఆర్డీఓ రమణామూర్తికి సోమవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వే నంబర్లు 74, 75, 76 నీమ్ నెస్ట్, 402-405, 409-412 రేణుక సహస్ర ఇన్‌ఫ్రాలో పంచాయతీ అనుమతులు లేకుండా కట్టడాలు చేపట్టారన్నారు. ఈ విషయమై సర్పంచ్, బిల్ కలెక్టర్‌ల దృష్టికి తెచ్చినా నిలుపుదల చేయడం లేదని, దీంతో పంచాయతీ ఆదాయానికి గండి పడుతుందన్నారు. సర్పంచ్, బిల్ కలెక్టర్‌పై విచారణ జరిపి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో వార్డు సభ్యులు శ్రీనివాస్, సురేశ్, బాలమణి, నిర్మల, ఆంజనేయులు ముదిరాజ్, సరిత, భవాని, గణేశ్, మంజుల, కోఆప్షన్ సభ్యుడు నాగరాజ్ ఉన్నారు.

ఆంగ్ల బోధనకు ఎలైట్ చాప్టర్ దోహదం

ఘట్‌కేసర్: ఆంగ్లభాష బోధన ఎలైట్ చాప్టర్ అధ్యాపకులకు ఎంతో దోహదపడతాయని ఉస్మానియా యూనివర్సిటీ డీన్, ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ డాక్టర్ సి.మురళీకృష్ణ అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ (ఏయూ)లో ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో ఇంగ్లిష్ భాష అధ్యాపకులకు సోమవారం ప్రారంభించిన 'ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్ అనురాగ్ యూనివర్సిటీ చాప్టర్' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో గౌరవ అతిథిగా వెంకట్‌రెడ్డి, ఏయూ ఉపకులపతి రామచంద్రం, రిజిస్ట్రార్ పాతిమా, డీన్ విజయకుమార్, శ్రీనివాస్‌రావు, అనంతలక్ష్మీ, పలు కళాశాలల ఆంగ్ల అధ్యాపకులు పాల్గొన్నారు.



బస్సును సాయంత్రం వేళల్లోనూ నడిపించండి

మేడ్చల్: మండలంలోని రావల్‌కోల్ గ్రామానికి ఆర్టీసీ బస్సులను సాయంత్రం వేళల్లోనూ నడిపించాలని వైస్ ఎంపీపీ గోపని వెంకటేశం మేడ్చల్ డిపో మేనేజర్‌ను కోరారు. ఈ మేరకు ఆయన డిపో మేనేజర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. రావల్‌కోల్ గ్రామానికి ఉదయం వేళల్లో సరిపడా బస్సులు వస్తున్నా సాయంత్రం వేళల్లో మండల కేంద్రం నుంచి బస్సులు లేకపోవడంతో గ్రామస్థులు రాకపోకలు సాగించడానికి ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారని అన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

కీసర: నాగారం మున్సిపాలిటీని అందరి సహకారంతో అభివృద్ధి పర్చడం జరుగుతుందని చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని 1వ వార్డులో జలమండలి నిధులతో చేపట్టనున్న వాటర్ పైప్‌లైన్ పనులతో పాటు 20 వార్డులో సుమారు రూ.5 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న అంతర్గత మురికి కాలువ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ వాణీరెడ్డి, కౌన్సిలర్లు సరితారమేష్, సుమిత్రసురేష్ తదితరులు పాల్గొన్నారు.


బీజేపీలో చేరికలు



పార్టీలో చేరిన వారితో ఈటల రాజేందర్

మేడ్చల్‌రూరల్: బీజేపీ ఎమ్మెల్యే, చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ సమక్షంలో సోమవారం పలువురు బీజేపీలో చేరారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని కందుకూరు మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో మేడ్చల్ మండలంలోని పూడూర్ గ్రామ పరిధిలోని ఈటల నివాసానికి తరలివచ్చి ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. అనంతరం సద్గురు ఇన్ఫ్రా డెవలపర్స్ వారి కేలండర్‌ను ఈటల ఆవిష్కరించారు.

కౌన్సిల్ సమావేశం



సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్

మేడ్చల్: గుండ్లపోచంపల్లి మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. చైర్ పర్సన్ లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కౌన్సిలర్లు పలు అంశాలపై చర్చించారు. అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ గ్రీన్ బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు. హరితహారంలో భాగంగా గ్రీన్ బడ్జెట్‌ను ఖర్చు చేసి గ్రీనరీని పెంచాలన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ ప్రభాకర్, కమిషనర్ రాములు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

కంటివెలుగును సద్వినియోగం చేసుకోండి

కీసర: సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు పథకంలో భాగంగా మున్సిపల్‌లో నివాసం ఉంటున్న 18 ఏళ్లు పైబడిన ప్రజలంతా ఈ నెల 18 నుంచి కంటి పరీక్షలు చేయించుకోవాలని దమ్మాయిగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్ అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కంటివెలుగు కార్యక్రమం నిర్వహణపై సమావేశంను నిర్వహించి అవసరమైన బడ్జెట్‌ను కేటాయించాలని సమావేశంలో నిర్ణయించారు. కమిషనర్ స్వామి, వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులపై దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య



అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

సాక్షి,మేడ్చల్ జిల్లా: ఉద్యోగులపై హింసాత్మక దాడులకు పాల్పడిన వారు ఎంత వారైనా చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) అభిషేక్ ఆగస్త్య అన్నారు. రావల్‌కోల్ గ్రామ కార్యదర్శి సతీష్‌పై జరిగిన దాడిన ఆయన తీవ్రంగా ఖండించారు. జిల్లాలో ఉద్యోగులపై ఇలాంటి దాడులు జరగకుండా అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామన్నారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట గ్రామ కార్యదర్శి సతీష్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ.. ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన ధర్నాలో ఆయన మట్లాడారు. భోజన విరామ సమయంలో ఉద్యోగుల జేసీఏ చైర్మన్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు రవిప్రకాష్, జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు కుర్రముల భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నాలో జిల్లా పంచాయతీ శాఖ అధికారి రమణమూర్తి, డీపీఎల్‌ఓ స్మిత, ఎంపీడీఓలు పద్మావతి, రమాదేవి సంఘీభావం తెలుపగా... టీఎన్జీవోస్, జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రతినిధులు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్యకు అందజేశారు. ఆందోళనలో టీఎన్జీఓస్ నాయకులు ఈశ్వర్, జేమ్స్‌దాసు, గిరికాంత్, సత్యం, జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, వేణుగోపాల్, శేషికుమార్, వెంకటరమణారెడ్డి, రవీందర్‌రెడ్డి, శోభారాణి, దేవేందర్‌రావు, కవిత పాల్గొన్నారు.

హక్కుల కోసం ఐక్యంగా పోరాడుదాం



కీసర: రాష్ట్రంలో విశ్వబ్రాహ్మణుల న్యాయమైన హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని విశ్వబ్రాహ్మణ(విశ్వకర్మ) రాష్ట్ర ఐక్య సంఘం డిమాండ్ చేసింది. ఆదివారం రాత్రి నాగారం మున్సిపాలిటీ పరిధిలోని జీఎస్ఆర్‌లో తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ(విశ్వకర్మ) ఐక్య సంఘం రాష్ట్ర కార్యవర్గ సాధారణ సమావేశం జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోజు భిక్షపతిచారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వడ్రంగుల కోసం పారిశ్రామిక ఇండస్ట్రీయల్ కారిడార్‌ను ఏర్పాటు చేయాలని, 50 ఏళ్లపైబడిన విశ్వబ్రాహ్మణులకు పెన్షన్ పథకం అమలు చేయాలన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా విశ్వబ్రాహ్మణులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేకుంటే ఉద్యమం చేస్తామన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి అనంతోజు బ్రహ్మచారి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు భాషపల్లి రమేష్‌చారి, నాయకులు నరసింహా చారి, శివలింగచారి, సిరిసిల్ల అధ్యక్షుడు చందనగిరి గోపాల్, నాగారం మహిళా సంఘం అధ్యక్షురాలు కవిత, ప్రధానకార్యదర్శి రావుట్ల లక్ష్మీ, సుజాత, రవిచారి, వెంకటచారి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం కేలండర్‌ను ఆవిష్కరించారు.

ప్రజలకు పారదర్శక పాలన అందించేందుకు కృషి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ పావనీయాదవ్

ఘట్‌కేసర్: ప్రజలకు పారదర్శక పాలన అందించేందుకు కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీయాదవ్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వేమనరెడ్డి అధ్యక్షతన సోమవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రతిభ చూపినందుకు మంజూరైన రూ.2కోట్లతో అభివృద్ధి పనులు చేపడదామన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు పీపీఈ కిట్లు, ప్రతి రెండు వార్డులకు ఒక చెత్త సేకరించే వాహనం, ట్రాక్టర్ కొనుగోలు చేయాలన్నారు. డీఆర్‌సీసీ షెడ్డును అభివృద్ధి చేయడం, ఎలక్ట్రికల్ సమస్యలు పరిష్కరించాలన్నారు. అదే విధంగా కంటి వెలుగు కార్యక్రమాన్ని అధికారుల సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, రమాదేవి, సంగీత, ఆంజనేయులుగౌడ్, అనురాధ, నస్రీన్‌సుల్తానా, హేమలత, శశికళ, మల్లేశ్, పద్మారావు, జహంగీర్, నరేశ్‌యాదవ్, నర్సింగ్‌రావు, రవీందర్, కోఆప్షన్ సభ్యులు సురేందర్‌రెడ్డి, బి.అరుణ, పి.అరుణ, షౌకత్, మేనేజర్ అంజిరెడ్డి, ఏఈ నరేశ్ పాల్గొన్నారు.

సమస్యలపై కమిషనర్‌కు వినతి



జవహర్‌నగర్: కార్పొరేషన్ సమస్యలపై సోమవారం జవహర్‌నగర్ బీజేపీ నాయకులు కమిషనర్ రామలింగంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జవహర్‌నగర్ బీజేపీ అధ్యక్షుడు రంగుల శంకర్ నేత మాట్లాడుతూ.. జవహర్‌నగర్ పరిధిలోని ప్రధాన రహదారి తీవ్ర కాలుష్యం వెదజల్లుతుందని, ప్రయాణీకులకు తీవ్ర ఇబ్బందులను గురిచేస్తూ ఎలాంటి అనుమతులు లేకున్నా నిబంధనలకు విరుద్ధంగా జీహెచ్ఎంసీ చెత్త డంపింగ్ లారీలు వస్తున్నాయని, లారీలు రాకుండా ఆపాలన్నారు. అదేవిధంగా తైబజార్ పేరుతో చిరు వ్యాపారులు, పలువురు వ్యాపార సంబంధిత వాహనదారుల నుంచి ఇష్టారాజ్యంగా డబ్బులు వసూలు చేస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కమల్, మహేశ్వరిగౌడ్, రామ్ నాయక్, సన్నీ, రాఘవేంద్రచారి, లక్ష్మీరెడ్డి, స్వర్ణలత, ఖైరున్నీస, యాదగిరి, అరుణ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరిస్తా



కొర్రెముల్‌లో మాట్లాడుతున్న అభ్యర్థి మల్లారెడ్డి

ఘట్‌కేసర్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడమే ప్రధాన లక్ష్యమని టీయూటీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి దేవన్నగారి మల్లారెడ్డి అన్నారు. ఉపాధాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా జెడ్పీ కొర్రెముల్, ఎదులాబాద్ బాలికలు, బాలురు, అంకుషాపూర్ పాఠశాలలో సోమవారం ఆయన ప్రచారం చేపట్టారు. ప్రచారంలో రాష్ట్ర బాధ్యులు దశరథ, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఘట్‌కేసర్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి భాషయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణాలేవి..?

- లేఅవుట్లు, పార్కుల్లో ఉత్సవ విగ్రహాలుగా దర్శనం
- ఆట వస్తువులున్నా.. వసతులు లేక నిరుపయోగంగా
- ఒక్కో క్రీడా ప్రాంగణం అభివృద్ధికి రూ.4 లక్షలు



కీసర మండల కేంద్రంలో ఒక నిర్మాణ సంస్థ లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం దృశ్యాలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుతో యువతలో క్రీడా స్ఫూర్తిని పెంచి మానసిక ఉల్లాసం, ఉత్సాహాన్ని కలిగించి వారిలో నైపుణ్యాన్ని వెలికితీయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో గండి పడుతోంది. ప్రజాప్రతినిధుల అలసత్వం, సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్న చందంగా క్రీడా ప్రాంగణాల పరిస్థితి అధ్వానంగా తయారైంది.

- నగర శివారుల్లోని క్రీడా ప్రాంగణాలు ఉత్సవ విగ్రహాలను మరిపిస్తున్నాయి. పలు చోట్ల లేఅవుట్లు, పార్కు స్థలాల్లో క్రీడా ప్రాంగణాలను మొక్కుబడిగా ఏర్పాటు చేయడంతో నిరుపయోగంగా మారాయి.
- 13 పురపాలక సంఘాలు, 61 గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడేలా నర్సరీలు, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు, సెగ్రిగేషన్ షెడ్లు, అన్నదాతలకు రైతు వేదికలను సమకూర్చిన సర్కారు సదాశయంతో పల్లె, పట్టణాల్లో క్రీడా ప్రాంగణాల ఏర్పాటునకు చర్యలు తీసుకుంటోంది.
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 13 పురపాలక సంఘాలు, 61 గ్రామ పంచాయతీల్లో 259 క్రీడా ప్రాంగణాల నిర్మాణానికి శ్రీకారం చుట్టగా ఇప్పటి వరకు ఏడాది గడుస్తున్నప్పటికిని 105 ప్రాంతాల్లో మాత్రమే మొక్కుబడిగా వసతుల లేమీతో ప్రారంభించారు.
- జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఈ క్రీడా ప్రాంగణాల నిర్మాణానికి డిజైన్‌కు రూపకల్పన చేయటంతో పాటు క్రీడా పరికరాలు, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ఒక్కో ప్రాంగణానికి రూ.4లక్షల చొప్పున నిధులు కేటాయించింది. అయినప్పటికీ 40 శాతం క్రీడా ప్రాంగణాలకు లేఅవుట్లు, పార్కు స్థలాల్లో నిర్మించినట్లు గ్రామీణ, పట్టణ క్రీడాకారులు విమర్శిస్తున్నారు.
- పలు క్రీడా ప్రాంగణాల్లో క్రీడా పరికరాలను సమకూర్చినప్పటికీ సరిపడా సౌకర్యాలు లేక నిరూపయోగంగా మారాయి. పలు చోట్ల క్రీడా సామగ్రి లేకపోవడంతో పాటు శిక్షకుల నియామకం ఇప్పటి వరకు జరగలేదు. ముఖ్యంగా క్రీడా ప్రాంగణాలకు చాలా చోట్ల ప్రహరీ లేకపోవడంతో ఇబ్బందిగా మారింది.
- పలు గ్రామ పంచాయతీల్లో బిల్డర్లు, పలు సంస్థలతో క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి పరిచి... పరికరాలు సమకూర్చినట్లు పత్రాలు చూపించి బిల్లులు కూడా కాజేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మిగతా చోట్ల క్రీడా ప్రాంగణాలకు స్థల సేకరణ ఇబ్బందిగా మారింది.